## తారెత్తిస్తున్న ఎండలు

- **ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత**

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎండలు తారెత్తిస్తున్నాయి. పగటిపూట ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరగటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 40డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటనలో పేర్కొన్నది. ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో అత్యధికంగా 44.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు తెలిపింది. ఎండల తీవ్రత దృష్ట్యా... దీంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్టు ఐఎండీ అధికారులు తెలిపారు.

| జిల్లా | ఉష్ణోగ్రతలు (డిగ్రీలలో) |
|---|---|
| 1. ఆదిలాబాద్ | 44.5 |
| 2. జగిత్యాల | 44.4 |
| 3. నిర్మల్ | 44.3 |
| 4. నిజామాబాద్ | 44.1 |
| 5. మంచిర్యాల | 43.9 |
| 6. కామారెడ్డి | 43.5 |
| 7. పెద్దపల్లి | 43.5 |
| 8. భద్రాద్రి-కొత్తగూడెం | 43.4 |
| 9. కరీంనగర్ | 43.4 |
| 10. నల్లగొండ | 43.4 |

# హరిరామ్‌ను అప్పగించండి

- **10 రోజుల కస్టడీ కోరిన ఏసీబీ**
- **కౌంటర్ దాఖలు చేయాలని నిందితుడిని ఆదేశించిన కోర్టు**
- **విచారణ నేటికి వాయిదా**

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): ఆదాయానికి మించి అక్రమ ఆస్తులను కూడబెట్టిన కేసులో నిందితుడైన గజ్వేల్ ఈఎన్సీ భూక్యా హరిరామ్‌ను 10 రోజులపాటు పోలీస్ కస్టడీకి అప్పగించాలని కోరుతూ ఏసీబీ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిటిషన్ దాఖలు చేశారు. నిందితుడు సహకరించకపోవడంతో విచారణకు సమయం సరిపోలేదని, ఆయన నుంచి అక్రమ ఆస్తుల వివరాలను తెలుసుకోవాల్సి ఉన్నదని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ముఖ్య భూమిక పోషించిన హరిరామ్ అవినీతికి పాల్పడినట్టు అభియోగాలు రావడంతో ఏసీబీ అధికారులు శనివారం ఆయన నివాసంలో సోదాలు నిర్వహించి పలు కీలక ఆధారాలను జప్తు చేశారని, హరిరామ్ రూ.100 కోట్లకుపైగా ఆస్తులను కూడబెట్టినట్టు ప్రాథమిక విచారణలో తేలిందని స్పష్టం చేశారు. ఆయనకు హైదరాబాద్‌లోని షేక్‌పేట, కొండాపూర్‌లో 2 విల్లాలు, శ్రీనగర్, నార్సింగి, మాదాపూర్‌లో 3 పాట్లు, అమరావతిలో వాణిజ్య స్థలం, సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలో 28 ఎకరాల వ్యవసాయ భూమి, పటాన్‌చెరులో 20 గుంటల భూమి, శ్రీనగర్‌కాలనీలో రెండు గృహాలు, బొమ్మల రామారంలోని 6 ఎకరాల్లో ఫామ్‌హౌజ్‌తోపాటు పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లు ఉన్నట్టు గుర్తించారని వివరించారు. ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని హరిరామ్ తరపు న్యాయవాదిని ఆదేశించిన ఏసీబీ కోర్టు.. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది

# కమ్యూనిస్ట్ యోధుడు ఓంకార్ ఆదర్శనేత

- **హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్**
- **ఓంకార్ శతజయంతి వార్షికోత్సవ లోగో ఆవిష్కరణ**

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపక నాయకుడు మద్దికాయల ఓంకార్ నేటి రాజకీయాల్లో అందరికీ ఆదర్శమని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఓంకార్ కీలక పాత్ర పోషించారని, ప్రజాసమస్యలపై శాసనసభలో గళమెత్తారని, పోరాటాలు నిర్మించారని చెప్పారు. హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో ఓంకార్ శతజయంతి ఉత్సవాల లోగోను జస్టిస్ చంద్రకుమార్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలను సేవగా భావించి, ప్రజల కోసం అహోరాత్రులు పోరాడిననేత ఓంకార్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, కుంభం సుకన్య, రాష్ట్ర కమిటీ సభ్యులు గాదె మల్లేశ్, తుడుం అనిల్‌కుమార్, పల్లె మురళి, ఏ కిష్టయ్య, కర్ర దానయ్య పాల్గొన్నారు. శతజయంతి ఉత్సవాల ప్రారంభసభ మే 12న వరంగల్ జిల్లా మచ్చాపూర్‌లో జరుగుతుందని తెలిపారు. ఈ సభకు కవులు, కళాకారులు, వామపక్ష పార్టీల నేతలు హాజరవుతారని వనం సుధాకర్ చెప్పారు.

## రేపు 'దోస్త్' నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : డిగ్రీ ఫస్టియర్ ప్రవేశాలకు నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) నోటిఫికేషన్ శుక్రవారం విడుదలకానుంది. బుధవారం దోస్త్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి షెడ్యూల్ ఖరారు చేస్తారు. ఈ సారి మూడు విడతల్లో సీట్లు భర్తీచేస్తారు. శుక్రవారం దోస్త్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు.

## వర్సిటీల్లో డిగ్రీ పరీక్షలు ఇంకెప్పుడు..?

- **బీజేపీ నేత రాణి రుద్రమ ఫైర్**

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): కేయూ, టీయూ, శాతవాహన, పాలమూరు, ఎంజీయూ పరిధిలో డిగ్రీ పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ ప్రశ్నించారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ ఆఫీస్‌లో ఆమె మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి కీలకమైన విద్యాశాఖ, హోంశాఖను తన దగ్గరే ఉంచుకున్నారని, విద్యాశాఖపై ఒక్కసారి కూడా సమీక్ష నిర్వహించలేదని విమర్శించారు.

## రేపు 'కాళేశ్వరం' పుస్తకావిష్కరణ

- **చీఫ్‌గెస్ట్‌లుగా హాజరు కానున్న హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి**
- **అసత్యప్రచారాన్ని తిప్పికొడ్తం: తెలంగాణ వికాస సమితి**

హైదరాబాద్, ఏప్రిల్30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాగునీటి రంగ నిపుణుడు శ్రీధర్‌రావు దేశ్‌పాండే రచించిన ''కాళేశ్వరం ప్రాజెక్టు: ప్రశ్నలు-విమర్శలు-వక్రీకరణలు-వివరణలు, సాగునీటి రంగంలో తెలంగాణ పదేండ్ల ప్రస్థానం'' పుస్తకావిష్కరణ కార్యక్రమం తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు సమితి ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో శుక్రవారం 5 గంటలకు పుస్తకావిష్కరణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అధ్యక్షతన జరగనున్న సభకు ముఖ్యఅతిథిగా మాజీమంత్రి హరీశ్‌రావు, గౌరవ అతిథిగా మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి, విశిష్ట అతిథులుగా జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్, అంబేద్కర్ వర్సిటీ మాజీ వీసీ సీతారామారావు, టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు దేవీప్రసాదరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, రిటైర్డు ఇంజినీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశం, సీనియర్ జర్నలిస్ట్ వేణుగోపాలస్వామి పాల్గొంటారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాల్సిన తప్పనిసరి అవసరం, సందర్భం ఉన్నందునే తెలంగాణ వికాస సమితి బాధ్యతగా తీసుకుని ఈ పుస్తకాన్ని తీసుకొస్తున్నదని ఎర్రోజు శ్రీనివాస్ వెల్లడించారు.

## సీడబ్ల్యూసీ చైర్మన్‌గా అతుల్‌జైన్

**కేంద్రజల్ శక్తిశాఖ ఉత్తర్వులు**

హైదరాబాద్, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ): కేంద్ర జల్ సంఘం (సీడబ్ల్యూసీ)చైర్మన్‌గా అతుల్‌జైన్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్రజలశక్తిశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సీడబ్ల్యూసీ చైర్మన్‌గా కొనసాగుతున్న ఎంకే సిన్హా పదవీ విరమణ పొందుతున్న నేపథ్యంలో ఆయన స్థానంలో అతుల్‌జైన్‌ను కేంద్రం నియమించింది. అతుల్‌జైన్ ప్రస్తుతం కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) చైర్మన్‌గా కొనసాగుతున్నారు. సీడబ్ల్యూసీ చైర్మన్‌గా అతుల్‌జైన్ నియామకంతో బోర్డు అధికారులు, ఎన్‌డబ్ల్యూడీఏ ఇంజినీర్ దేవేందర్‌రావు తదితరులు హర్షం వ్యక్తంచేశారు. తెలంగాణ ఈఎన్సీ అనిల్‌కుమార్ అతుల్‌జైన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.